# ఎవరిది నేరం?

## డాక్టర్ జి. రవికృష్ణ



**"రామాపురం తిరనాలకు పోదామా ఈ రోజు రాత్రి." శ్రీను హఠాత్తుగా ఈ ప్రతిపాదన మా ముందుంచాడు. నలుగురైదుగురు మిత్రులం సాయంకాలం వేళల్లో అపుడపుడు శ్రీను వాళ్ల సినిమా థియేటర్ ఆఫీసు రూంలో చేరి కబుర్లు చెప్పుకుంటూ వుంటాం.**

'అందరూ ఓ.కే. అలానే నేనూ ఓ.కే." అన్నాడు ప్రభాకర్.

"ఈ రోజక్కడ విశేషమేంటి శ్రీను" అడిగా న్నేను ఖాళీ చేసిన టీ కప్పు టేబుల్ పైన పెడ్తూ.

"ఈ రాత్రంతా అక్కడ నరసింహస్వామి గుడి దగ్గర జాతర జరుగుతుంది. సరదాగా ఉంటుంది. రాత్రి భోంచేసి 9 గంటలకు బయలు దేరితే పదికల్లా అక్కడుంటాం. ఓ రెండు గంటలు అక్కడ స్పెండ్ చేసి మళ్లీ ఒంటి గంటకంతా ఇళ్లకు చేరుకోవచ్చు. మా జీపు కూడా రెడీగా ఉంది" అన్నాడు శ్రీను.

నాక్కూడా రొటీన్ వర్క్‌తో విసుగ్గా ఉండి సరే అన్నాను. పైగా ఇంట్లో శ్రీమతి కూడా పుట్టింటికి వెళ్లడంతో వద్దనేవారు కూడా లేరు.

రాత్రి నేను ఇంటి దగ్గర భోజనం చేసి రెడీ అయి కూర్చున్నాను. ఈలోగా అంతా జీపులో వచ్చేశారు.

అంతా బయలు దేరాం. ప్రభాకర్ జీపు నడుపుతున్నాడు. "మధ్యలో ఫారెస్ట్ ఏరియా ఉంది కదా, రోడ్డు అదీ ఎలా ఉందో..." అనుమానం వ్యక్తం చేశాను.

"ప్రభాకర్ స్టీరింగ్ వీల్ ముందుంటే భయపడాల్సిందేం లేదులే." ఇషాక్ అన్నాడు.

ఆ రాత్రిలో జీపు హెడ్‌లైట్స్ చీకటిని చీల్చుకుంటూ దారి చూపిస్తుంటే, పాటలు వింటూ, కబుర్లు చెప్పుకుంటూ చల్లటి కొండగాలి శరీరాలకు మత్తుగా తగుల్తుంటే మా ప్రయాణం సాగింది. గంటకల్లా రామాపురంలో ఉన్నాం.

అపుడే అక్కడ సందడి సందడిగా ఉంది. తిరనాల వాతావరణం బాగా కన్పిస్తోంది. ఎక్కడ చూసినా జనం. రంగుల రాట్నాలు, చెరుగ్గడలు, మొక్కజొన్న కంకులు, మిరపకాయ బజ్జీలు, రంగు సోడాలు, కొబ్బరి బొండాలు, రకరకాల అంగళ్లు, పట్టణాలలో మనకు కన్పించడం మానేసిన పరికిణీలు. అవి వేసుకుని గలగలమని పారే ఏటినీటి పాటలా, జాతరకే అందాన్ని పారాణిలా అద్దుతూ సాగుతున్న పల్లెపడుచులు. ఆ వాతావరణమంతా చాలా ఉత్సాహ పూరితంగా ఉంది.

చెరుగ్గడలు ముక్కలు చేయించుకుని తలా ఒకటి నములుతూ గుడి దగ్గరలో ఉన్న మైదానం దగ్గరకు వెళ్లాం.

వెన్నెల వెలుగులో మైదానం పెళ్లిపీటల పైనున్న పెళ్లి కూతుర్లా మెరిసిపోతుంది.

చెక్క భజన కార్యక్రమం జరుగుతోందక్కడ. మైదానం మధ్యలో జట్టు నాయకుడు గొంతెత్తి పాట పాడుతున్నాడు. అతని చుట్టూ ఇరవై మంది దాకా కాళ్లకు గజ్జెలు కట్టుకుని, చేతుల్లో చెక్కలు పట్టుకుని లయబద్ధంగా పాటకు అనుగుణంగా పాదం కదుపుతూ, మధ్య మధ్యలో పాటకు గొంతు కలుపుతూ, వలయాకారంలో తిరుగుతూ నృత్యం చేస్తున్నారు. పాట ముగింపులో తీవ్ర స్థాయికి చేరుకున్నపుడు దాని కనుగుణంగా నాట్యం కూడా క్రమేణా వేగం పుంజుకుని చాలా ఉద్విగ్న భరితంగా కొనసాగుతోంది.

కాసేపు అక్కడ చూసి గుళ్లోకి వెళ్లొద్దామని ప్రభాకరం అనడంతో అంతా గుళ్లోకి వెళ్లి దైవదర్శనం చేసుకొని బయటకు వచ్చాం.

గుడి ముందున్న ఆవరణలో ఎవరో భాగవతారిణి 'గజేంద్ర మోక్షం' హరికథ చెప్తోంది. చల్లటి గాలికి హరికథ వింటుంటే జోలపాటలా వుందో ఏమో కొందరు నిద్రలో జోగుతున్నారు. ఇంకొందరు ఆసక్తిగా హరికథ వింటున్నారు.

ఇంతలో దూరంగా ఉన్న మామిటి తోటలో

నుండి పెద్దగా అరుపులు కేరింతలు విన్పించాయి. పెట్రోమాక్స్ లైట్ల వెలుగులో పది పదిహేను మంది రెండు బల్లల చుట్టూ కూర్చునున్నారు. అంతకంటే స్పష్టంగా ఇంకేం కన్పించడం లేదు.

మాపక్కనే వెడుతున్న పోలీస్ కానిస్టేబుల్‌ను ఆపి "ఏంటక్కడ అంతగా అరుస్తున్నారు" అడిగాడు శ్రీను.

"ఊర్లో పెద్దోళ్ల ఇంటికి టౌన్ నుండి ఫ్రెండ్స్ వచ్చినట్టున్నారు. పార్టీ చేసుకుంటున్నారు." చెప్పాడు కానిస్టేబుల్ సిగరెట్ తీసి వెలిగించుకుంటూ.

"పార్టీ అయినా అంతలా అరుస్తూ కేరింతలు కొట్టాల!" అడిగా న్నేను.

కానిస్టేబుల్ నావైపు విచిత్రంగా చూశాడు.

"పార్టీ అంటే ఏదో స్వీటు హాట్ పార్టీ కాదు. మందు పార్టీ. మరి మందు కొట్టినవాళ్లు గోల చేయక మౌనంగా మునుల్లా తపస్సు చేస్తారా" చాలా సాధారణమైన విషయంలా చెప్పాడు కానిస్టేబుల్.

"అదేంటి ప్రొహిబిషన్ ఉంది కదా. మరీ అంత పబ్లిగ్గా తాగుతున్నారే?" ఒకింత ఆశ్చర్యంగానే అడిగాను.

'ఓరి పిచ్చివాడా' అన్నట్టు నావైపు జాలిగా చూసి ఓ నవ్వు నవ్వి అక్కడ నుండి వెళ్లిపోయాడు కానిస్టేబుల్.

కొబ్బరి బొండాలు తాగి అలా నడుచుకుంటూ గుడి ప్రాకారం వెనుక వైపుకు వెళ్లాం. చుట్టూ అరటి తోటలు, మామిడి తోటలు.

గుడి వెనుక భాగంలో వంద గజాల దూరంలో ఒక పెద్ద బోర్డు చుట్టూ ఓ ఇరవై మంది దాకా గుంపుగా కింద కూర్చుని ఉన్నారు. నలుగు రైదుగురు నిలబడే ఉన్నారు. ప్రక్కనే ఉన్న పెట్రోమాక్స్ లైటు వారికి వెలుగునిస్తోంది.

మేమంతా ఆ గుంపు దగ్గరకు వెళ్లాం.

'కాయ్ ఏనుగుమీద కాయ్. ఒకటికి రెండు.'

"వెయ్ పులిమీద వెయ్ ఒకటికి ఒకటి"

'గుర్రం పైన కాసుకో. ఒకటికి ఏడు తీసుకో'

ఆ పెద్ద బోర్డు వెనక కూర్చుని అరుస్తూ చేతిలో ఉన్న పేక ముక్కలు వేగంగా కలుపుతున్నాడు ఎర్రటి బనీను వేసుకున్న కుర్రాడొకడు.

అతని ముందున్న బోర్డుపైన కుడివైపున పులి, ఎడమ వైపున ఏనుగు, రెండింటికి మధ్యలో పైభాగాన గుర్రం రంగులలో అందంగా చిత్రించి ఉన్నాయి.

అందరు వారికి ఇష్టమైన బొమ్మపైన రూపాయి, రెండు, అయిదు రూపాయలు డబ్బులు వేస్తున్నారు.

పేక ముక్కలు వేగంగా కదులుతున్నాయి ఎర్ర బనీను కుర్రాడి చేతిలో.

అందరు సస్పెన్స్ సినిమా చూస్తున్నంత ఉత్కంఠతతో, ఊపిరి బిగపట్టి చూస్తున్నారు. పేకముక్కలకు ఒక వైపున పులి, ఏనుగు, గుర్రం బొమ్మలు ఒక్కో దాని మీద ఒక్కోటి చిత్రించారు.

ఒక పేక ముక్క తిరగేశాడు.

పులి బొమ్మ అది. పులి మీద డబ్బు కట్టిన వాళ్లకు అంతకు అంత కలిపి ఇచ్చాడు. ఏనుగుపైన, గుర్రం పైన ఉన్న డబ్బంతా పెట్టెలో వేసుకున్నాడు.

"ఇదంతా మోసం కదా. పల్లె జనాల్ని ఇలా జూద మాడేలాగ చేసి మోసం చేస్తుంటే ఎవరూ ఎందుకు అడ్డుకోరు" అన్నా న్నేను.

"నిజమే. ఇది జూదమే. కచ్చితంగా తప్పు పనే. కాని గుర్రప్పందాల మాట ఏమిటి. అవి జూదం కాదని న్యాయస్థానాలే తీర్పు ఇచ్చాయి కదా. అంతెందుకు ఎన్ని రాష్ట్ర ప్రభుత్వాలు లాటరీలు నడపడం లేదు. ఇటీవల కొన్ని ప్రభుత్వాలు ఆపేశాయి. అయినా ఇంకా కొన్ని లాటరీలు నడుస్తూనే ఉన్నాయి. మరి రేసులు జూదం కానపుడు లాటరీలు తప్పు కానపుడు ఇక్కడ జరిగే ఈ ఆట ఎంత మాత్రం తప్పంటావు, అలా అని నేను ఇవి సమర్థిస్తున్నానని కాదు." అన్నాడు శ్రీను.

శ్రీను వాదన సమంజసంగానే ఉందన్పించడంతో నేనింకేం మాట్లాడలేదు.

"మనకెందుకు ఆ గొడవలు, చర్చలు గానీ. ఇంక పోదాం పద"అని ముందుకు కదిలాడు ఇషాక్.

అంతా వెనక్కి తిరిగి నాలుగు అడుగులు వేసామో లేదో ఇంతలో

"సార్ వద్దు సార్. కొట్టకు సార్. నీ కాళ్లు పట్టుకుంటా కొట్టకు సార్" అన్న అరుపులు, మనుషులు చెల్లా చెదురుగా పరుగులు పెడుతున్న శబ్దాలు విన్పించడంతో ఆగి వెనక్కి తిరిగి చూశాం.

మాకు ఇందాక కన్పించిన పోలీసు కానిస్టేబుల్ అక్కడ ఉన్న వాళ్లను లాఠీతో కొడ్తున్నాడు. అందరూ తలో దిక్కూ పారిపోయారు. పోలీసు ఎర్రబనీను కుర్రాణ్ని లాఠీతో రెండు దెబ్బలు కొట్టాడు.

"వద్దు సార్. ఇంకెప్పుడు చెయ్యను సార్" అని అరుస్తున్నాడు.

"దొంగ నా కొడుకుల్లారా. పల్లె జనాన్ని మోసం చేసి డబ్బులు దోచుకుంటారా. మక్కెలిరగ గొడ్తా. ఎక్కువరిచినావంటే స్టేషన్లో యేసి కుళ్ల బొడుస్తా" అరుస్తూ లాఠీతో పెట్రోమాక్స్ లైట్‌ను ఢడేల్ మని కొట్టాడు. అది ముక్కలు చెక్కలయింది.

ఎర్ర బనీను కుర్రోడి కళ్లలో తిరిగిన కన్నీళ్లు వెన్నెల వెలుగులో స్పష్టంగా కన్పిస్తున్నాయి.

ఆరోజు వాడికొచ్చిన ఆదాయమంతా ఆ పెట్రోమాక్స్ లైట్ బాడుగకు ఇచ్చిన వానికి, కొత్తది కొనివ్వడానికే సరిపోదు. ఇంటికి పోతే తిండి గింజలు పట్టుకొస్తాడేమోనని ఆకలిగా ఎదురు చూసే పెళ్లాం పిల్లలు గుర్తుకు వచ్చి ఉంటారు కాబోలు.

అంతవరకు జరిగినదంతా ఒక ఎత్తు, ఇంతలో ఎదురుగా కన్పించిన దృశ్యం ఒక ఎత్తు. అది చూసి ఆశ్చర్య పోవడం మావంతయింది.

పోలీస్ కానిస్టేబుల్ లాఠీ చంకలో పెట్టుకొని కింద కూర్చుని నింపాదిగా బోర్డుపైన పులి, గుర్రం, ఏనుగు బొమ్మల పై వున్న నోట్లు, చిల్లర మొత్తం చేతి రుమాల్లో మూటకట్టి ప్యాంట్ జేబులో దోపుకుంటున్నాడు.

దూరంగా మామిడి తోటలో మందు పార్టీ అరుపులు, కేరింతలు రాను రాను మరింత పెద్దవయ్యాయి. ○

